సాక్షి తిరుపతి

మంగళవారం। 12। ఆగస్టు। 2025



అన్నదాతకు తీరని నష్టం

మరో నాలుగురోజుల్లో పంట కోత చేయాల్సి ఉండగా వర్షం రావడంతో వరి సాగు చేసిన రైతులకు తీరని నష్టం వాటిల్లింది. - 8లో



సమస్యలను వాయిదా వేయొద్దు

చిన్న చిన్న సమస్యలను కూడా వాయిదా వేయవద్దని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ అధికారులను ఆదేశించారు. - 8లో



హక్కులను కాలరాస్తే ప్రతిఘటిస్తాం

కూటమి ప్రభుత్వం విద్యార్థుల హక్కులను కాలరాస్తే ప్రతిఘటిస్తామని విద్యార్థిసంఘాల నేతలు తీవ్రంగా హెచ్చరించారు. - 8లో

న్యూస్‌రీల్

స్కూల్ గేమ్స్ సెక్రటరీ పోస్టుకు దరఖాస్తులు

తిరుపతి సిటీ: జిల్లాలో రెండేళ్ల కాలవ్యవధితో స్కూల్ గేమ్స్ సెక్రటరీ పోస్టు నియామకాలకు సంబంధించి అర్హులైన స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్), పీఈటీల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ కేవీఎస్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో కనీసం 10 ఏళ్ల సర్వీసు కలిగి అర్హులైన ఉపాధ్యాయులు ఈనెల 20వ తేదీలోపు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని సూచించారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 85 అర్జీలు

తిరుపతి క్రైం: తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 85 ఫిర్యాదులు అందినట్టు ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. ఇందులో దొంగతనాలు, ఆస్తి తగాదాలు, ఆర్థికపరమైన లావాదేవీలు ఉన్నాయన్నారు. వెంటనే సంబంధిత అర్జీలు పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 3 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 80,628 మంది స్వామివారిని దర్శించుకోగా 30,505 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.73 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

డీ-ఫార్మసీ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ: ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికిగానూ డీఫార్మసీ రెండేళ్ల కాలవ్యవధి గల కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ బైపీసీ, ఎంపీసీ రెగ్యులర్ లేదా ఓపెన్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ కోర్సుకు అర్హులన్నారు. విద్యార్థులు httpr://apsbtet.in/pharmacy వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ప్రతిని తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని ఫార్మసీ విభాగంలో ఈనెల 19వ తేదీలోపు అందజేయాలని తెలిపారు. లేదా 9908857585, 9966761446, 9963541557, 9550690007,9059698747 నంబర్లకు వాట్సాప్ ద్వారా పంపవచ్చన్నారు.

నేటి నుంచి ఉచిత విద్యకు దరఖాస్తులు

తిరుపతి అర్బన్: ప్రైవేటు అండ్ ఎయిడెడ్ పాఠశాలల్లో పేద పిల్లలకు అందించాల్సిన 25 శాతం సీట్లకు సంబంధించి ఉచిత విద్య కోసం మంగళవారం నుంచి ఈ నెల 20 వరకు దరఖాస్తులు చేసుకోవాలని సమగ్రశిక్ష కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి సురేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సచివాలయంలో లేదా డబ్యూడబ్యూడబ్యూ.సీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. అనంతరం ఈ నెల 25న ఎంపికైన విద్యార్థుల ఫలితాలను వెల్లడిస్తామని, 31 నుంచి పాఠశాలల్లో ప్రవేశాలు ఉంటాయని స్పష్టం చేశారు. హెల్ప్‌లైన్ కోసం 1800-4258599 నంబరుకు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు సంప్రదించవచ్చన్నారు. లాటరీ పద్ధతిలో ఎంపిక ఉంటుందని వెల్లడించారు. దివ్యాంగులు, హెచ్ఐవీ బాధితుల పిల్లలు, అనాథలు, వీధి పిల్లలకు ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారు మాత్రమే అర్హులుగా పేర్కొన్నారు.

టాటా కేర్ ఫౌండేషన్‌తో ఎంఓయూ



ఒప్పందపు పత్రాలను మార్చుకుంటున్న బ్యాంక్, క్యాన్సర్ కేర్ ఫౌండేషన్ అధికారులు

తిరుపతి తుడా: స్థానిక జూపార్క్ రోడ్డులోని ఎస్వీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అండ్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ (స్వీకార్)లో సోమవారం టాటా కేర్ ఫౌండేషన్‌తో ఫెడరల్ బ్యాంక్ పలు అంశాలపై ఒప్పందం కుదుర్చుకుంది. ప్రధానంగా సంజీవినీ ప్రొగ్రాంలో భాగంగా క్యాన్సర్ డయాగ్నిస్టిక్ టెస్టులు, చికిత్స అవసరమైన అర్హులైన రోగులకు ఆర్థిక సహాయ సహకారాలను అందించడమే ఎంఓయూ లక్ష్యమని బ్యాంక్ అధికారులు తెలిపారు. అలాగే అస్సాం రాష్ట్ర క్యాన్సర్ కేర్ ఫౌండేషన్‌తోనూ ఇదే అంశాలపై అవగాహన కుదుర్చుకున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఫెడరల్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అండ్ సీఎఫ్ఓ ఎం.వెంకట్రామన్, టాటా క్యాన్సర్ సీఎఫ్ఓ కుమార్ నందుల, అస్సాం క్యాన్సర్ కేర్ ఫౌండేషన్ సీఓఓ డాక్టర్ జైప్రకాష్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఖజానా ఖాళీ!



వరదయ్యపాళెం : తొండంబట్టు పంచాయతీలో రోడ్డు మీదే నిల్వ ఉన్న మురుగు

పంచాయతీల అభివృద్ధి గురించి కూటమి ప్రభుత్వం గాలికొదిలేసింది. ప్రస్తుతం సర్పంచులుగా ఉన్న వారు పూర్తిగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు కావడంతో వివక్ష చూపుతోంది. పంచాయతీల అభివృద్ధికి కేంద్రం విడుదల చేసే 15వ ఆర్థిక సంఘం నిధులను పక్కదారి పట్టిస్తోంది. దీంతో పంచాయతీల నిర్వహణ భారంగా మారుతోంది. కనీస అవసరాలైన తాగునీరు, వీధిలైట్లు, పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు ముప్పుతిప్పలు పడుతున్నారు.

- పంచాయతీలు వెలవెల
- 15వ ఆర్థిక సంఘం నిధులకు ఎదురుచూపులు
- పది నెలలుగా అవస్థలు పడుతున్న అధికారులు
- పారిశుద్ధ్య పనులకు నిధుల కొరత
- రెండు విడతల నిధుల విడుదల ఎప్పుడో?



వరదయ్యపాళెం : కూటమి ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు కేటాయించే నిధుల్లో కోత పెడుతుండటంతో సర్పంచులు, అధికారులు ఏ పని చేయాలన్నా ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. పంచాయతీలు 15వ ఆర్థిక సంఘం, స్టాంప్ డ్యూటీ, వృత్తి పన్నుల పైనే ఆధారపడి ఉన్నాయి. పంచాయతీల్లో నిర్వహణ ఖర్చులు అమాంతంగా పెరిగిపోవడంతో వచ్చిన నిధులు పారిశుద్ధ్య కార్మికుల వేతనం, మైనర్ రిపేర్ల ఖర్చులకు కూడా సరిపోవడం లేదు. కొన్ని పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్మికులు వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పంచాయతీలో ఏ పని చేయాలన్నా నిధుల కొరతతో ముందడుగు వేయలేకపోతున్నారు.

పెరిగిన నిర్వహణ ఖర్చులు

తిరుపతి జిల్లాలో 34 మండలాల్లో 774 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వాటి పరిధిలో 9,09,555 మంది జనాభా ఉన్నారు. పంచాయతీల్లో ట్రై సైకిళ్ల నిర్వహణ, విద్యుత్ బకాయిలు, పైపులైన్ సమస్యలు, ఓవర్ హెడ్ ట్యాంకులు, పారిశుద్ధ్య పనులు పెరిగిపోయాయి. దీంతో చేసిన పనులకే దిక్కులేకుండా పోగా, అధికారులు నిత్యం పంచాయతీలను తనిఖీ చేసి సమస్యలను పరిష్కరించాలని ఆదేశిస్తుండటంతో అదనపు ఖర్చులు పెరిగిపోతున్నాయని వాపోతున్నారు.

అసలే వర్షాకాలం

వర్షాకాలం ప్రారంభ నేపథ్యంలో పంచాయతీల్లో ప్రధానంగా పారిశుద్ధ్య సమస్యలు పుట్టుకొస్తాయి. తద్వారా వివిధ రకాల వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. అయితే ప్రధానంగా పారిశుద్ధ్య పనులు చేపట్టాలి. వ్యాధుల నియంత్రణకు క్లోరినేషన్ చేయాలి. ఈ పరిస్థితుల్లో పంచాయతీల ఖజానా ఖాళీగా ఉండడంతో సర్పంచులు తలలు పట్టుకుంటున్నారు. దీంతో సర్పంచులు ఏమీ చేయలేక నిస్సహాయ స్థితిలో ఉన్నారు. ఆదాయ వనరులు ఉండే మేజర్ పంచాయతీలను మినహాయిస్తే మిగిలిన 90శాతం గ్రామ పంచాయతీలను నిధుల కొరత వెంటాడుతోంది.

రూ.60 కోట్ల నిధులు పెండింగ్

గ్రామ పంచాయతీకి జనాభా ప్రాతిపదికన ఆర్థిక సంఘ నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తుంది. ఆ దిశగా తిరుపతి జిల్లాలోని 774 పంచాయతీలకు సంబంధించి ఒక విడతకు రూ. 45 కోట్ల నుంచి రూ. 60 కోట్ల వరకు 15వ ఆర్థిక సంఘ నిధులు జమ కావాల్సి ఉంది. అలాగే వైద్యఆరోగ్యశాఖ నుంచి ఏటా రెండు విడతల్లో పంచాయతీలకు రూ. 10 వేలు చొప్పున మొత్తంగా రూ. 20 వేలు జమ కావాలి. ఈ నిధులు కొన్ని సంవత్సరాలుగా పంచాయతీలకు జమ కావడం లేదు. ఈ విధంగా పంచాయతీలకు రావాల్సిన నిధులను సకాలంలో విడుదల చేయకుండా పంచాయతీల అభివృద్ధిని కూటమి నీరుగారుస్తోంది.

స్వాతంత్య్ర వేడుకులకు ఉత్తి చేతులే..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రచార ఆర్భాటాలకే ప్రాధాన్యం ఇస్తోంది. అధికారంలోకి వచ్చిన వెంటనే పంచాయతీలో స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారు. అయితే వేడుకలకు నిధులు అందిస్తారని అందరూ భావించగా.. పంచాయతీల నుంచే వాడుకోవాలని జీఓ జారీ చేయడంపై సర్పంచులు ఆవేదన చెందుతున్నారు. చేతిలో చిల్లిగవ్వలేకుండా వేడుకలు ఎలా చేయాలో తెలియక ఆందోళన చెందుతున్నారు.

పది నెలలుగా నిధుల కొరత

2024-25 సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు విడుదల చేసే 15వ ఆర్థిక సంఘం నిధులను మొదటి విడత కింద సెప్టెంబర్ 3వ తేదీన విడుదల చేశారు. ఆ నిధులతోనే కాలం నెట్టుకొస్తున్నారు. రెండో విడత నిధులను కూడా కేంద్రం విడుదల చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వాటిని విడుదల చేయలేదనే విమర్శలున్నాయి. ఒక్కో పంచాయతీలో దాదాపుగా పారిశుద్ధ్య కార్మికులకు నెలకు రూ.25 వేలు ఖర్చు వస్తోంది. ప్రస్తుతం కార్మికులు వేతనం అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.



చెన్నవారిపాళెం దళితవాడలో నీరు పారని మురుగు కాలువ

నిధులు కేటాయించకుండా కాలయాపన



కూటమి ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధికి నిధులు కేటాయించకుండా కాలయాపన చేస్తున్నారు. గత ప్రభుత్వం పంచాయతీ నిధులను పక్కదారి పట్టిస్తోందని గగ్గోలు పెట్టిన సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రస్తుతం చేస్తున్నదేమిటి?. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సంఘ నిధులను సంక్షేమ పథకాలకు మళ్లించి పంచాయతీల అభివృద్ధిని గాలికొదిలేశారు.

– దుద్దు వేణు, సర్పంచ్, సీఎల్ఎన్‌పల్లి

వీధి దీపాల మరమ్మతులకు ఇబ్బందులే..



కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘ నిధులను పక్కదారి పట్టిస్తుండడంతో గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి కుంటుపడుతోంది. కనీసం వీధి లైట్ల ఏర్పాటు, పంచాయతీ ప్రజలకు తాగునీటి అవసరాలు తీర్చేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. నిధులు విడుదల కానిదే ఏ పనులు చేపట్టలేం.

– చంద్రారెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు, వరదయ్యపాళెం మండలం

డీఎస్సీ ఫలితాలు విడుదల

తిరుపతి సిటీ: ఈ ఏడాది జూన్ 6 నుంచి జూలై 2వ తేదీ వరకు జరిగిన డీఎస్సీ పరీక్షలు నిర్వహించారు. చిత్తూరు ఉమ్మడి జిల్లాలో 1,478 పోస్టులకు సుమారు 50 వేల మందికిపైగా పోటీపడ్డారు. తుది కీ ఆధారంగా నార్మలైజేషన్ ప్రక్రియ ద్వారా రూపొందించిన డీఎస్సీ ఫలితాలను అధికారులు సోమవారం విడుదల చేశారు. టెట్ వివరాలకు సంబంధించి అభ్యర్థులకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్‌లో తమకు తామే టెట్ వివరాలను సరిచేసుకునేందుకు ఈనెల 13వ వరకు రెండు రోజుల పాటు వెసులుబాటు ఇచ్చారు.

బ్యాడ్మింటన్ జిల్లాస్థాయి ఎంపిక పోటీలు రేపు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో 13వ తేదీ అండర్-19 బాలబాలికల బ్యాడ్మింటన్ జిల్లాస్థాయి ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు డీఎస్‌డీఓ శశిధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు 13వ తేదీ ఈ పోటీలకు హాజరు కావాలని ఆయన కోరారు.

టీటీడీకి రూ.20 లక్షల విరాళం



విరాళం చెక్కులను అదనపు ఈఓ వెంకయ్య చౌదరికి అందజేస్తున్న దాతలు

తిరుమల: బెంగళూరుకు చెందిన చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రెసిడెంట్ ఎస్ఎన్‌వీఎల్ నరసింహరాజు అనే భక్తుడు సోమవారం టీటీడీ శ్రీవేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు, ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా అందించారు. ఈ మేరకు దాత ప్రతినిధి మోహన్ కుమార్ రెడ్డి తిరుమలలోని టీటీడీ అదనపు ఈఓ కార్యాలయంలో సీహెచ్ వెంకయ్య చౌదరికి విరాళం చెక్కులను అందజేశారు.

అనుబంధ విభాగాలు చురుగ్గా పనిచేయాలి

- కూటమి అరాచకాలు, దాడులపై నిరసనలు చేయండి
- తిరుపతి, చిత్తూరు జిల్లాల వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు భూమన



వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులతో సమావేశమైన భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగట్టడంలో వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల నాయకులు చురుగ్గా పని చేయాలని చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి సూచించారు. తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన పార్టీ అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతూ వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులు, అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపుతున్నారని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో కూటమి నాయకులు చేస్తున్న అరాచకాలు, దాడులపై పార్టీ జిల్లా అనుబంధ విభాగాల నాయకులు ఎప్పటికప్పుడు స్పందిస్తూ నిరసనలు చేపట్టాలన్నారు. కేసులకు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని.. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడిగా తాను ఉద్యమాల్లో ముందుంటానని తెలిపారు. కూటమి అరాచకాలను, దాడులను ఎప్పటికప్పుడు సోషల్‌మీడియా ద్వారా ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల కూటమి నాయకులు ఎస్సీ, ఎస్టీ, బీసీలపై విపరీతంగా దాడులకు పాల్పడుతున్నారని, వాటిని ఆయా వర్గాల నాయకులు ఖండించాలన్నారు. సమావేశంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల జిల్లా నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో గంజాయి రాజ్యమేలుతోంది



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

వాకాడు: ప్రశాంతంగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి అన్యాయాలు, దౌర్జన్యాలతో పాలన గాడి తప్పిందని ఉమ్మడి నెల్లూరు జిల్లా ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తెలిపారు. సోమవారం ఆయన వాకాడు ఎంపీపీ కార్యాలయంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ ప్రభుత్వం వచ్చాక గూడూరులో కొందరు విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు, మద్యం విక్రయాలు, గంజాయి అమ్మకాలు సాగిస్తున్నారని, అయితే వారిని దండించాల్సిన స్థానిక ప్రజాప్రతినిధి వారి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొనడం దేనికి సంకేతమన్నారు. పులివెందులలో పోలింగ్ బూత్‌లను ఊరికి దూరంగా మార్చడం విచారకరమన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు కొడవలూరు దామోదర్‌రెడ్డి, సర్పంచులు భాస్కర్‌రెడ్డి, మధురెడ్డి, మాజీ ఎంపీపీ మధురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటమిని లెక్క చేయని నాయకుడు తాటిపర్తి

- సుదీర్ఘకాలం రాజకీయ జీవితం గడిపిన నేత
- 1988లో జరిగిన ఉపఎన్నికలో ఎమ్మెల్యేగా గెలుపు
- కేవలం సంవత్సరమే ఎమ్మెల్యేగా పని చేసిన తాటిపర్తి చెంచురెడ్డి
- నివాళులు అర్పించిన మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ నేతలు



మాజీ ఎమ్మెల్యే తాటిపర్తి చెంచు రెడ్డి (88)

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే తాటిపర్తి చెంచురెడ్డి(88) అనారోగ్యంతో కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఆయన తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. సుదీర్ఘకాలం రాజకీయాల్లో కొనసాగిన తాటిపర్తి.. పలు పర్యాయాలు వరుసగా ఓటమి పలకరించినా నిరుత్సాహ పడకుండా పోరాడారు. 1988లో జరిగిన ఉప ఎన్నికలో అప్పటి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొండుగారి శ్రీరామమూర్తిపై కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి గెలుపొందారు. అంతకుముందు 1978లో జనతా పార్టీ తరఫున పోటీ చేసి అప్పటి కాంగ్రెస్ ఐ అభ్యర్థి ఉన్నం సుబ్రహ్మణ్యం నాయుడు చేతిలో ఓడిపోయారు. 1983లో కాంగ్రెస్ ఇండిపెండెంట్ మధ్య త్రిముఖ పోరు జరగడంతో కాంగ్రెస్ అభ్యర్థి కంటే కూడా అధిక ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచారు. 1985లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి టీడీపీ అభ్యర్థి సత్రవాడ మునిరామయ్య చేతిలో కేవలం 80 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. అయితే సత్రవాడ మునిరామయ్య ఎంపిక చెల్లదని, ఆయన ఓ రైల్వే కాంట్రాక్టర్ అంటూ కోర్టు మెట్లు ఎక్కి విజయం సాధించారు. దీంతో కోర్టు సత్రవాడపై అనర్హత వేటు వేయడంతో 1988లో ఉప ఎన్నిక అనివార్యమైంది. టీడీపీ నుంచి కొండుగారి శ్రీరామమూర్తి ఉప ఎన్నిక బరిలో నిలబడగా, కాంగ్రెస్ నుంచి యథావిధిగా తాటిపర్తి పోటీపడ్డారు. టీడీపీ తరఫున ఎన్టీ రామారావుతో పాటు సినీ ప్రముఖులు శ్రీకాళహస్తిలో పెద్దఎత్తున ప్రచారం చేయగా, కాంగ్రెస్ తరఫున సూపర్‌స్టార్ కృష్ణ, జమున లాంటి వాళ్లు ప్రచారం చేశారు. టీడీపీ, ఎన్టీఆర్ హవా కొనసాగుతున్న సమయంలోనే ఉప ఎన్నిక రావడం.. చెంచురెడ్డి గెలవడం జరిగిపోయింది. 1989లో మళ్లీ కాంగ్రెస్ తరఫున బరిలోకి దిగి టీడీపీ అభ్యర్థి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి చేతిలో ఓడిపోయారు. అనంతరం రాజకీయాలకు దూరంగా ఉన్న ఆయన వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి తిరిగి రాజకీయాల్లోకి వచ్చారు. చెంచురెడ్డి మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూద్ రెడ్డి, పార్టీ సీనియర్ నేత ఉన్నం వాసుదేవ నాయుడు, మాజీ ఎంపీ చింతా మోహన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

చెంచురెడ్డి మృతికి ఎంపీ గురుమూర్తి సంతాపం

తిరుపతి మంగళం: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే తాటిపర్తి చెంచురెడ్డి మరణం పట్ల తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి విచారం వ్యక్తం చేశారు. ఆయన మృతి శ్రీకాళహస్తికి తీరని లోటని గురుమూర్తి అన్నారు. సామాన్య ప్రజలకు అండగా నిలిచి, నియోజకవర్గ అభివృద్ధికి చెంచురెడ్డి చేసిన కృషి చిరస్మరణీయమని ఆయన కొనియాడారు. అందుకే ప్రజల మనసుల్లో ఆయన ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని గుర్తుచేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

కొన్నింటికే ఉచితం!

- ఉచిత బస్సు ఉత్తర్వులు జారీ
- జిల్లాలో మొత్తం సర్వీసులు 855
- అందులో 356 సర్వీసుల్లో మాత్రమే అనుమతి
- నాన్‌స్టాప్ సర్వీసులకు నో చాన్స్
- సప్తగిరి ఎక్స్‌ప్రెస్, తిరుమలకు అవకాశం లేదు



తిరుపతి అర్బన్: కూటమి ప్రభుత్వం మహిళలకు ఈనెల 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించేందుకు సిద్ధమైంది. స్త్రీశక్తి పేరుతో కల్పించాలని ఆర్టీసీ అధికారులకు సోమవారం ఉత్తర్వులను జారీచేసింది. అయితే పల్లెవెలుగు, అల్ట్రాపల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లు, మెట్రో సర్వీసులు, సిటీ సర్వీసులకు మాత్రమే అనుమతులు ఇస్తున్నట్లు ఉత్తర్వుల్లో వెల్లడించింది. ఇక జిల్లాలో మెట్రో సర్వీసులు, సిటీ సర్వీసులు లేకపోవడంతో మూడు రకాల సర్వీసులకు మాత్రమే అనుమతి ఉంటుంది.

వీటిల్లో అనుమతి లేదు

జిల్లాలో సప్తగిరి ఎక్స్‌ప్రెస్‌లే అధికం. వాటిలో మహిళలకు ఉచిత ప్రయాణానికి అనుమతి లేదు. అంతేకాకుండా తిరుమలకు వెళ్లే సర్వీసుల్లోనూ, నాన్ స్టాప్ సర్వీసుల్లో, ఏసీ బస్సులతో పాటు ఇతర సర్వీసుల్లో అనుమతి లేదు. అదే విధంగా జిల్లా వ్యాప్తంగా మొత్తం 855 సర్వీసులు ఉండగా.. వాటిల్లో 356 సర్వీసులకు మాత్రమే అనుమతి ఇచ్చారు. అందులో పల్లెవెలుగు 274, సాధారణ ఎక్స్‌ప్రెస్‌లు 77, అల్ట్రా పల్లెవెలుగు 5 సర్వీసులకు మాత్రమే అనుమతిచ్చారు.

జిల్లాలో 16.5 లక్షల మంది మహిళలు

జిల్లాలో 16.50 లక్షల మంది మహిళలు ఉన్నారు. వీరి కోసం 356 సర్వీసులకు అనుమతిచ్చారు. ఎన్నికల సమయంలో మాత్రం ఆర్టీసీ సర్వీసుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అంటూ ఊదరగొట్టారు. తీర 14 నెలలు తర్వాత పథకాన్ని అమలు చేసే క్రమంలో అనేక మెళికలు పెట్టారు. దీంతో మహిళలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

15 నుంచి అమలు చేస్తున్నాం



మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని స్త్రీశక్తి పేరుతో అమలు చేయడానికి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఆ మేరకు డీఎంలతో సమావేశం నిర్వహించి ఆదేశాలిచ్చాం. జిల్లాలో 356 బస్సులకు మాత్రమే అనుమతి ఉంది. పల్లెవెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సాధారణ ఎక్స్‌ప్రెస్‌లకు అవకాశం కల్పిస్తున్నాం. మరోవైపు పాఠశాలకు వెళ్లే బాలికలు ఇకపై బస్సు పాస్ తీసుకోవాల్సిన అవసరం లేదు. వారికి పైన తెలిన మూడు సర్వీసుల్లో ఉచితంగా ప్రయాణం చేయడానికి వీలుంటుంది.

– జగదీష్, జిల్లా ప్రజారవాణా అధికారి

భారత్ నెట్ అమలుపై చర్యలేమిటి?

తిరుపతి మంగళం : ప్రభుత్వ స్కూళ్లలో ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించేందుకు కేంద్ర బడ్జెట్‌లో భారత్ నెట్ కార్యక్రమం రూపొందించారని.. అయితే ఇందుకు తీసుకుంటున్న చర్యలేమిటని ఎంపీ గురుమూర్తి ప్రశ్నించారు. సోమవారం ఆయన పార్లమెంటులో భారత్ నెట్ అమలుకు కేంద్రప్రభుత్వం, టెలికమ్యూనికేషన్స్ శాఖ, విద్యాశాఖల మధ్య ఎలాంటి సమన్వయం ఉందో వివరాలు తెలపాలని కోరారు. తిరుపతి జిల్లాతో పాటు రాష్ట్రంలో ఎన్ని స్కూళ్లకు భారత నెట్ ప్రాజెక్టు ద్వారా ఇంటర్నెట్ కనెక్టివిటీ కల్పిస్తున్నారో చెప్పాలన్నారు. భారత్ నెట్ ప్రాజెక్ట్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని ప్రభుత్వ సెకండరీ స్కూళ్లకు దశలవారీగా బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీని అందిస్తున్నామని కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి ఎంపీకి వివరించారు. ఇందులో భాగంగా తిరుపతి జిల్లాలో ఇప్పటి వరకు 147 స్కూళ్లకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించామని, మరో 154 స్కూళ్లకు కనెక్టివిటీ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

బియ్యం కూడా ఇవ్వలేరా సామీ..?



సివిల్ సప్లయ్ ఆఫీస్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు

తిరుపతి అర్బన్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం సీఎం చంద్రబాబు నాయుడు కార్డు ఉన్న ప్రతి కుటుంబానికీ రేషన్ సరుకులు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం తిరుపతి అర్బన్ తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని సివిల్ సప్లయ్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల 1 నుంచి 15 వరకు రేషన్ బియ్యం ఇవ్వాల్సి ఉందని చెప్పారు. అయితే 1 నుంచి 4 లేదా 5వ తేదీకే డీలర్లు దుకాణాలు మూసి వెళ్తున్నారని మండిపడ్డారు. గత నెలలో 65 వేల మంది కార్డుదారులు బియ్యం తీసుకోలేదన్నారు. డీలర్లు అదనంగా 10శాతం బియ్యం ఇచ్చేవారని.. దాంతో తమ రేషన్ పరిధిలోని వారు కాకుండా స్థానికేతరులు వచ్చిన డీలర్లకు బియ్యం ఇచ్చేవారని చెప్పారు. అయితే కూటమి సర్కార్‌లో డీలర్లు ఇస్తున్న 10శాతం అదనపు బియ్యాన్ని నిలుపుదల చేయడంతో స్థానికేతరులకు బియ్యం ఇవ్వడం లేదని వెల్లడించారు.

క్లుప్తంగా

ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిజాయితీ



బాధితురాలికి బంగారం లాకెట్‌ను అందజేస్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ అల్తాఫ్

తిరుపతి రూరల్ : బస్సులో దొరికిన బంగారు నగలను బాధితురాలికి అప్పగించి ఓ ఆర్టీసీ బస్సు డ్రైవర్ తన నిజాయతీని చాటుకున్నాడు. వివరాలు.. పుంగనూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు (ఏపీ39జెడ్0092) తిరుపతి నుంచి భీమవరం, కొమ్మిరెడ్డిగారిపల్లి మీదుగా పుంగనూరుకు సర్వీసు నడుస్తోంది. ఈ క్రమంలో ఈ నెల 10 తేదీన ఆదివారం తిరుపతి స్టాఫ్ క్వార్టర్స్ వద్ద తన చంటిబిడ్డను ఎత్తుకుని బస్సు ఎక్కిన సోంపల్లి భార్గవి వెంకటరామాపురం వద్ద దిగి వెళ్లిపోయింది. కాసేపటి తరువాత తన రెండేళ్ల కుమార్తె రిషితాచౌదరి మెడలోని బంగారం గొలుసుకు ఉన్న లాకెట్ కనిపించక పోవడంతో బస్సులోనే పడిపోయి ఉంటుందన్న అనుమానంతో ఆర్టీసీ డిపో మేనేజర్‌కు ఫోన్ చేసింది. ఆమె దగ్గర ఉన్న టికెట్ ఆధారంగా ఆయన బస్ డ్రైవర్ అల్తాఫ్‌కు సమాచారం చేరవేయడంతో అప్పటికే సదుం దగ్గర వెళ్తున్న ఆయన బస్సును ఆపి ఆమె కూర్చున్న సీటు వద్దకు వెళ్లి చూడగా సీటు కింద పడి ఉంది. వెంటనే ఆయన బంగారం లాకెట్‌ను తీసుకుని బాధితురాలికి సోమవారం ఉదయం ఆమెకు అప్పగించారు. అయితే నిజాయితీ చాటుకున్న బస్సు డ్రైవర్ అల్తాఫ్‌ను బాధితురాలి కుటుంబీకులతో పాటు గ్రామస్తులు అభినందించారు.

వైభవంగా గెరిగ ఊరేగింపు



గంగమ్మ ప్రతిరూపమైన గెరిగ ఊరేగింపు

రేణిగుంట: గంగ జాతర మహోత్సవాల సందర్భంగా సోమవారం అమ్మవారికి ప్రతిరూపమైన గెరిగ ఊరేగింపు అత్యంత వైభవంగా నిర్వహించారు. పురవీధుల్లో అడుగడుగునా భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో కర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రేణిగుంటలో గ్రామ దేవతగా వెలసిన గంగమ్మ తల్లి జాతర మహోత్సవాలు వైభవంగా మొదలయ్యాయి. సోమవారం అమ్మవారికి ప్రతిరూపమైన గెరిగను అలంకరించి, గ్రామ చాకలిలో విశేష అలంకరణలో తలపై గెరిగను పెట్టుకుని డప్పుల దరువులు, పంబ వాయిద్యాల నడుమ పట్టణంలోని వీధుల్లో దర్శనమిచ్చారు. మంగళవారం జరగనున్న గంగ జాతర మహోత్సవాలకు సర్వం సిద్ధమైంది. రేణిగుంట పోలీసుల సహకారంతో భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు కమిటీ సభ్యులు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సోలా మల్లికార్జున్ రెడ్డి, సదా శివ రెడ్డి, జ్యోతి నారాయణ, ఉమేష్,లక్ష్మణ్ రెడ్డి, వీఆర్ రావణ, చినబాబు,సూరి,రేణు,భాస్కర్,వార్డు సభ్యులు ఎంజీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరిలో వైఎస్సార్‌సీపీ హవా

- కొత్త మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌ను రద్దు చేసిన కౌన్సిలర్లు
- పాత మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌లే కొనసాగించాలని 16 మంది ఆమోదం
- టీడీపీకి చెంప పెట్టులాంటి తీర్పు
- మరోసారి విఫలమైన కూటమి ప్రభుత్వ ప్రయత్నాలు



మున్సిపల్ లీగల్ అడ్వైజర్ జయప్రకాష్‌ను మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిలర్‌గా కొనసాగించాలని మద్దతు తెలియజేస్తున్న మున్సిపల్ కౌన్సిలర్లు

వెంకటగిరి (సైదాపురం): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ నేతలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడడంతో పాటు పదవులను సైతం తమ గుప్పెట్లో వేసుకునేందుకు విశ్వప్రయత్నాలు సాగిస్తోంది. అయితే తిరుపతి జిల్లా వెంకటగిరి మున్సిపల్‌లో మాత్రం వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సారథ్యంలో టీడీపీకి వరుస పరాజయాలు చవి చూపిస్తున్నారు. తొలిసారి మున్సిపల్ చైర్‌పర్సన్ పదవికీ అవిశ్వాసం అంశం తెరపైకి తెచ్చి అభాసుపాలయ్యారు. ఈ విషయం మరువకముందే మరోసారి మున్సిపల్ లీగల్ అడ్వైజర్‌గా ఉన్న జయప్రకాష్‌ను మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ నుంచి తొలగించి కొత్తవారికి నియమించాలని టీడీపీ నేతలు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో 24వ అంశంగా పొందుపరిచారు. ఇందుకు సముచితంగా కొందరు మున్సిపల్ కౌన్సిలర్లు లేరు. ఈ క్రమంలో ఈనెల 31వ తేదీన అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా కౌన్సిలర్లు నెల్లూరుకు తరలివెళ్లారు. గతంలో ఈ సమావేశానికి ఇద్దరు కౌన్సిలర్లు మాత్రమే హాజరు కావడంతో సమావేశాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ వెంకటరామిరెడ్డి వ్యక్తపరిచారు. అనంతరం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ఏకతాటిపై ఉండి అభివృద్ధికి తాము ఎప్పుడూ అడ్డురామని బహిరంగంగానే ప్రకటన చేశారు.

16 మంది ఆమోదం

వెంకటగిరి మున్సిపల్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియతో పాటు 24 మంది మున్సిపల్ కౌన్సిలర్లు ఉండగా సోమవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన మున్సిపల్ సమావేశానికి 19 మంది మున్సిపల్ కౌన్సిలర్లు హాజరయ్యారు. సమావేశం జరుగుతున్న తరుణంలో మున్సిపల్ అధికారి అంశం–24 చదువుతుండగా ఆ అంశాన్ని చదనవసరం లేదని ఆ అంశాన్ని అజెండాలో నుంచి తొలగించాలని కౌన్సిలర్లు ముక్తకంఠంతో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియకు వివరించారు. ఈ మేరకు ఈ అంశం తొలగించాలన్నా వారు చేతులు పైకి ఎత్తమనగా 16 మంది వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు తమ మద్దతు వ్యక్తపరిచారు. దీంతో మున్సిపల్ కౌన్సిల్ అజెండా నుంచి అంశం -24ను తొలగించారు. దీంతో ప్రత్యక్షంగానే వెంకటగిరి మున్సిపాలిటీలో మరో విజయం వైఎస్సార్‌సీపీ తమ ఖాతాల్లోకి వేసుకుంది.

తల్లికి పిడికెడు అన్నం పెట్టలేక..!

- ఇంటి నుంచి గెంటేసిన ఓ ప్రబుద్ధుడు
- కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసిన ఓ తల్లి



ఆస్తి పత్రాలను చూపుతున్న రావి సులోచనమ్మ

సాక్షి టాస్క్‌ఫోర్స్: నవమోసాలు మోసి కని పెంచిన తల్లికి పట్టెడన్నం పెట్టలేక ఓ కొడుకు ఇంటి నుంచి గెంటేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. తిరుపతి జిల్లా బాలాయపల్లికి చెందిన పెంచలయ్య నాయుడు, రావి సులోచనమ్మకు రావి హరిప్రసాద్, రెండవ కుమారుడు రావి రవికుమార్ ఇద్దరు కొడుకులు. పెంచలనాయుడు చనిపోయిన తర్వాత ఆయన ద్వారా సంక్రమించిన స్థిరాస్తులను ఇద్దరు కుమారులు, తల్లి రావి సులోచనమ్మ పంచుకుని, ఒప్పంద పత్రం రాసుకున్నారు. ఆ ప్రకారం ముగ్గురు వేర్వేరుగా కలిసి కాపురం ఉండాల్సి ఉంది. అయితే రెండో కొడుకు రావి రవికుమార్, అతని భార్య లక్ష్మికామాక్షి ఇద్దరూ కలిసి తాము చూసుకుంటామని చెప్పి తల్లి సులోచనమ్మను వారింటికి తీసుకెళ్లారు. కొద్దిరోజుల తర్వాత కుమారుడు రవికుమార్ భార్యతో కలిసి తల్లి దగ్గర ఉన్న రూ.10 లక్షల నగదు, 15 సవర్ల బంగారు నగలను నమ్మించి తీసుకున్నాడు. అంతేకాకుండా ఆమె స్థిరాస్తులను కూడా అనుభవిస్తున్నాడు. ఆ తర్వాత ఆమెను కొట్టి ఇంటి నుంచి తరిమివేశాడు. దిక్కుతోచని స్థితిలో ఆమె బాలయ్యపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కొడుకు, కోడలిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే తమ మీదే కేసు పెడతావా.. నిన్ను చంపేస్తామని వారు ఆమెను భయభ్రాంతులకు గురిచేశారు. ఈ నేపథ్యంలో ఆమె సోమవారం కలెక్టరేట్‌లో అధికారులకు తన పరిస్థితిని వివరించడంతో తప్పకుండా న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

టీడీపీ నేతల ప్రోద్బలంతోనే మట్టి తవ్వకాలు



వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణరెడ్డి

పెళ్లకూరు: మండలంలోని చిల్లకూరు మన్నేముత్తేరి చెరువులో యంత్రాలతో మట్టి తవ్వకాలు చేపట్టి.. కోళ్ల ఫారం యాజమాన్యానికి పూర్తిగా సహకరించింది స్థానిక టీడీపీ నాయకులేనని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన సాక్షితో మాట్లాడారు. కోళ్ల ఫారం నిర్మాణం తొలి దశ నుంచి యాజమాన్యం నుంచి ముడుపులు తీసుకుని టన్నుల కొద్దీ మట్టి తవ్వకాలు చేపట్టి జేబులు నింపుకున్నట్లు విమర్శించారు. మూడు నెలలుగా పౌల్ట్రీ నిర్మాణ పనులు జరుగుతుంటే అధికార పార్టీలో ఉంటూ అడ్డుకోకుండా.. ఇప్పుడెందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. గతంలో మూడు పర్యాయాలు టీడీపీ నాయకులే వెళ్లి మట్టి తవ్వకాలను అడ్డుకున్నప్పుడు జిల్లా కలెక్టర్‌కు ఎందుకు ఫిర్యాదు చేయలేదన్నారు. ముడుపులు అందుకుంటే ఒక న్యాయం.. అడిగినంత ఇవ్వకపోతే మరో న్యాయమా? అని ప్రశ్నించారు. రైతుల ప్రయోజనాల కోసం మాజీ సర్పంచ్ బసివిరెడ్డి వెంకటశేషారెడ్డి పదిహేనేళ్ల కిందట చెరువులో సిమెంట్ పైపులు వేసి తాత్కాలికంగా రోడ్డు ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రస్తుతం గ్రావెల్‌తో రోడ్డు అభివృద్ధి చేసి పౌల్ట్రీ వద్దకు వాహనాల రాకపోకలకు వినియోగించుకుంటున్నట్లు తెలిపారు.

దళితుల భూముల్లో పెత్తనం చెలాయిస్తారా?



కూటమి నాయకులు ఆక్రమించుకుంటున్న భూములను పరిశీలిస్తున్న నారాయణ

చిల్లకూరు : కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కొంతమంది నాయకులు దళితులు సాగు చేసుకునే భూములను ఆక్రమించుకుంటూ పెత్తనం చెలాయించడం దారుణమని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. సోమవారం ఆయన తిరుపతి నుంచి విజయవాడ వెళ్తుండగా చిల్లకూరు మండలం నక్కలకాలువ కండ్రిగలోని మిగుల భూములను స్థానిక సీపీఐ నాయకులతో కలసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నక్కలకాలువ కండ్రిగలో సర్వే 1 నుంచి 23 వరకు ఉన్న మిగుల భూములు సుమారు 126 ఎకరాలను 2003 నుంచి నెలబల్లిరెట్టపల్లికి చెందిన దళితులు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. మధ్యలో ఆ భూములను ఏపీఐఐసీకి కేటాయించినట్లు అధికారులు చెప్పడంతో కొంతమంది దళితులు సాగు చేయలేదన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ భూములపై కన్నేసిన కూటమి నాయకులు తమకు అనుకూలంగా ఉన్న వారి పేరిట స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించడం దారుణమన్నారు. రెండు రోజులుగా కూటమి నాయకులు ఈ భూములను దున్ని గట్లు తొలగించి దళితులపై దౌర్జన్యానికి పాల్పడడం దారుణమని, తక్షణం వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న ప్రతి దళిత కుటుంబానికి కనీసం అరెకరం చొప్పున భూములు కేటాయించాలని కోరారు. ఆయన వెంట సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్ ప్రభాకర్, నాయకులు ఉన్నారు.

గంగమ్మకు వెండి కవచాల విరాళం



స్వర్ణ పూత వెండి కవచాలను ఊరేగింపుగా తెస్తున్న దాతలు

రేణిగుంట: గంగ జాతర సందర్భంగా సోమవారం స్థానిక పాంచాలి నగర్‌కు చెందిన సూర్య ప్రకాశ్ రెడ్డి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి అమ్మవారి మూలవిరాట్‌కు స్వర్ణ పూత వెండి కవచాలను అందజేశారు. దాత ఇంట్లో అమ్మవారి కవచాలకు విశేష పూజలు నిర్వహించి మేళతాళాలు నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. ఆలయంలో ఆలయ ధర్మకర్త సోలా మల్లికార్జున్ రెడ్డి, సభ్యులు స్వర్ణ పూత వెండి కవచాలను స్వీకరించారు. కార్యక్రమంలో సాయి మనోహర్, ధీరజ్ రెడ్డి, భరద్వాజ్ రెడ్డి, దినేష్, శరత్ బాబు, శివరాంరెడ్డి, హరిహర నాథ్ రెడ్డి, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి

పెళ్లకూరు: మండల కేంద్రమైన పెళ్లకూరులోని దళిత కాలనీకి చెందిన మెరియం సుధాకర్ (45) సోమవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు.. కాలనీలోని విద్యుత్ స్తంభం నుంచి గృహ విద్యుత్ సరఫరా రాకపోవడంతో కరసాయంతో విద్యుత్ తీగలను సరి చేసే క్రమంలో విద్యుత్ షాక్‌తో కుప్పకూలిపోయాడు. స్థానికులు హుటాహుటిన శ్రీకాళహస్తికి చికిత్స నిమిత్తం తరలించారు. అప్పటికే సుధాకర్ మృతి చెందినట్లు అక్కడి వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మీ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సుధాకర్ మృతితో కాలనీలో విషాదం నెలకొంది.

ఆలయ టెండర్లన్నీ మాకే..

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి ఆలయానికి సంబంధించిన టెండర్లు వేరే వారు వేయకూడదని తమ పార్టీకి చెందిన నాయకులు మాత్రమే దక్కించుకోవాలని తెలుగుదేశం నాయకులు హుకూం జారీ చేస్తున్నారు. పొరపాటున ఎవరైనా టెండర్ దాఖలు చేస్తే వారిపైన భౌతిక దాడులకు దిగుతూ దుర్భాషలాడుతున్నారు. సోమవారం శ్రీకాళహస్తి ఆలయానికి సంబంధించిన చుక్కల నిడిగల్లు గ్రామంలో ఉన్న భూముల్లో తైలం చెట్లను వేలం వేయడం జరిగింది. దీనికి సంబంధించి కొందరు వేలంలో పాల్గొనేందుకు ఆలయానికి చేరుకున్నారు. అయితే ఆలయంలో తిష్ట వేసిన తెలుగుదేశం నాయకులు వారిని అడ్డుకుని వారి పైన దాడికి దిగారు. కాంట్రాక్టర్లు విస్తుపోయి అక్కడ నుంచి పలాయనం చెత్తగించారు. ఆలయ అధికారులు తమకు ఏమీ తెలియదన్నట్లు చోద్యం చూడడంపై సర్వత్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

చిన్న సమస్యలను వాయిదా వేయొద్దు

- కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు 188 అర్జీలు
- పరిష్కారం చూపాలన్న జేసీ



జేసీకి సమస్యలను వివరిస్తున్న సురేష్, బ్రాహ్మణపల్లి గ్రామస్తుడు

తిరుపతి అర్బన్: ప్రతి అర్జీని నిశితంగా పరిశీలించి పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 188 అర్జీలు వచ్చాయి. అందులో రెవెన్యూ సమస్యలపై 108 అర్జీలను అందుకున్నారు. జేసీతోపాటు ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘు వాన్షి, డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, రోజ్‌మాండ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ కొందరు చిన్న చిన్న సమస్యల కోసం దూర ప్రాంతాల నుంచి కలెక్టరేట్‌కు వస్తున్నారని తెలిపారు. వాటిని స్థానికంగానే పరిష్కరించాలని వెల్లడించారు. కొందరు చిన్న సమస్యలను సైతం పరిష్కరించకుండా వాయిదాలు వేస్తున్నట్లు తెలుస్తోందన్నారు. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

మురుగుపై నిర్మాణాలు

తిరుచానూరులోని 7వ వార్డు పరిధిలోని కొత్తవీధిలో ఉన్న పొన్న మురుగు కాలువపై స్థానికంగా ఏలుమలై రెడ్డి ఇంటిని నిర్మిస్తున్నారు. దాంతో ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్న అందరికీ ఇబ్బందిగా ఉంది. అధికారులు స్పందించి న్యాయం చేయాలని డీఆర్వో నరసింహులకు, డీపీఓ సుశీలాదేవికి వినతిపత్రాన్ని ఇచ్చాం.

– మునిరత్నం రెడ్డి, తిరుచానూరు

పర్యావరణ కాలుష్యంతో అవస్థలు

తిరుపతి రూరల్ ప్రాంతంలోని బ్రాహ్మణపల్లికి చెందిన వాళ్లం. అయితే మా గ్రామంలోని సమీపంలో క్వారీతో తీవ్రమైన కాలుష్యంతో అవస్థలు పడుతున్నాం. మా గ్రామానికి ఒకసారి పరిశీలించి న్యాయం చేయండి. క్వారీ వారికి ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు.

– సురేష్, బ్రాహ్మణపల్లి గ్రామస్తుడు

శ్మశానికి దారి చూపండి సార్...

'పాకాల మండలం జయదేవపురం–పంటపల్లికి చెందిన ఎస్సీకాలనీ వారికి చెందిన శ్మశానానికి దారి లేకుండా పోయింది. ఓ నేత ఆక్రమించారు. ప్రశ్నిస్తే మాపై దౌర్జన్యాలు చేస్తున్నారు. అధికారులు వచ్చి పరిశీలించి మా ఎస్సీ కాలనీకి చెందిన శ్మశానానికి దారి చూపండి' అంటూ స్థానికులు డీఆర్వోకు వినతి పత్రం అందించారు.–పంటపల్లి ఎస్సీ కాలనీ వాసులు

అన్నదాతకు తీరని నష్టం

- గాలీవాన బీభత్సానికి 270 ఎకరాల్లో నేలవాలిన వరి పైరు
- 148 మంది రైతన్నలకు రూ.3.5 కోట్ల మేర నష్టం



గొల్లపాలెం వద్ద వర్షానికి నేలవాలిన వరిపైరు

వాకాడు : మరో నాలుగు రోజుల్లో కోత కోయాల్సిన వరి పంట నేలపాలైంది. నాలుగు రోజుల్లో పంట చేతికొస్తుందని సంబరపడిన అన్నదాతలకు ఆదివారం రాత్రి కురిసిన వర్షం రూపంలో తీరని నష్టం వాటిల్లింది. సుమారు 148 మంది రైతన్నలకు కంటతడిని మిగిల్చింది. దీంతో 270 ఎకరాల్లో పంట నేలవాలి మొలకెత్తి, పాచిపోతోంది. వర్షం అదును దాటి కురవడంతో రైతులకు తీరని నష్టాన్ని తెచ్చిపెట్టింది. మండలవ్యాప్తంగా ఖరీఫ్‌లో 1500 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. అందులో తొలిదశలో ఇప్పటివరకు 209 ఎకరాల్లో పంట కోత పూర్తయింది. ఈ నెల 15 నుంచి రెండో దశ పంట కోత ఉండగా.. మొత్తం 270 ఎకరాల్లో వర్షానికి పంట నీట మునిగింది. దీంతో మండలంలో దాదాపు రూ.3.5 కోట్లు నష్టం వాటిల్లినట్లు రైతులు చెబుతున్నారు. అప్పులు చేసి సాగు చేసిన పంట నేలవాలడంతో కన్నీరే మిగిలిందని రైతులు వాపోతున్నారు. గతేడాది కనీసం పెట్టిన పెట్టుబడులు చేతికందక అప్పుల ఊబిలో కూరుకుపోయామని.. ఇప్పుడు ఈ వర్షం మరింత అప్పుల్లోకి నెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని కానిస్టేబుల్ మృతి

- నివాళి అర్పించిన ఎస్పీ, డీఎస్పీలు



అయ్యప్ప మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు (ఇన్‌సెట్) అయ్యప్ప (ఫైల్)

కార్వేటినగరం: గుర్తుతెలియని వాహనం ఢీకొని కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన మండలంలోని కుప్పానిగుంట సమీపంలో చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం.. కార్వేటినగరం బీసీ కాలనీకి చెందిన అయ్యప్ప(41) పుత్తూరు ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఓ కేసు విచారణ కోసం పళ్లిపట్టుకు వెళ్తూ మార్గమధ్యంలోని సురేంద్రనగరం సమీపం, చిన్నకనుమ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి తల్లిదండ్రులతో పాటు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అయ్యప్ప మృతదేహానికి ఘన నివాళి

మృతి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ అయ్యప్ప మృతదేహానికి తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఘన నివాళి అర్పించారు. అలాగే పుత్తూరు డీఎస్పీ రవికుమార్, నగరి డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్, స్థానిక సీఐ హనుమంతప్ప పూలమాల వేసి నివాళి అర్పించారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ అయ్యప్ప కుటుంబానికి తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రభుత్వ పరంగా కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటానని వారికి భరోసా ఇచ్చారు. అదే విధంగా ఏఆర్ కానిస్టేబుల్ యూనియన్ ఆధ్వర్యంలో అయ్యప్ప కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సహాయం అందించారు.

పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు

ఏఆర్ కానిస్టేబుల్‌గా పుత్తూరులో విధులు నిర్వహిస్తున్న అయ్యప్ప మృతి చెందడంతో సోమవారం తన స్వగ్రామం కార్వేటినగరంలో పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

హక్కులను కాలరాస్తే ప్రతిఘటిస్తాం

సమస్యలపై పోరాడాలన్న యువగళం పిలుపు ఏమైంది లోకేష్?–సంఘాల ఎన్నికలు నిర్వహిస్తామన్న మీరు హామీ ఇవ్వలేదా?–తక్షణం ఆంక్షలు ఎత్తివేయకుంటే ఉద్యమాలు ఉధృతం చేస్తాం–తిరుపతిలో కూటమి ప్రభుత్వంపై విద్యార్థి సంఘాల కన్నెర్ర–మంత్రి లోకేష్ దిష్టిబొమ్మ దహనానికి యత్నం... ఉద్రిక్తత

- ప్రభుత్వ విద్యాసంస్థలను నిర్వీర్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం
- హామీలు నెరవేర్చలేదంటూ మంత్రి లోకేష్ దిష్టిబొమ్మ దగ్ధానికి యత్నం
- విద్యార్థి సంఘాల నేతలను అడ్డుకున్న పోలీసులు



విద్యార్థి సంఘాల నేతలతో వాగ్వాదానికి దిగిన పోలీసులు



విద్యార్థి సంఘాల నేతలను ఈడ్చుకెళ్తున్న పోలీసులు

తిరుపతి సిటీ: కూటమి ప్రభుత్వంపై విద్యార్థి సంఘాలు మరోసారి కన్నెర్ర చేశాయి. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తే ఖబడ్దార్ అని హెచ్చరించాయి. ఈ మేరకు విద్యార్థి సంఘాల నాయకులు సోమవారం శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ (ఎస్వీయూ) నుంచి తిరుపతి టౌన్ క్లబ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మంత్రి లోకేష్ దిష్టిబొమ్మ దహనానికి ప్రయత్నించగా వందల సంఖ్యలో పోలీసులు చేరుకుని వారిని ఈడ్చి పడేసి అడ్డుకున్నారు. ఓ దశలో పోలీసులు, విద్యార్థి సంఘాల నాయకుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నేతలు మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యాసంస్థల్లో సమస్యలు, కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీపై పోరాడుతున్న వామపక్ష, ప్రజాతంత్ర విద్యార్థి సంఘాలను విద్యాలయంలోకి వెళ్లకుండా అడ్డుకునేలా ఉత్తర్వులు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. తక్షణమే వాటిని రద్దు చేయకుంటే పెద్దఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థను సర్వనాశనం చేశారని, స్కూళ్లు, కళాశాలల్లో మౌలిక వసతులు కొరవడ్డాయని ఆరోపించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలపై ప్రశ్నించినందుకు విద్యార్థి సంఘాలపై ఆంక్షలు విధిస్తూ బ్రిటీష్ పాలనను తలపించేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు.

మీదే బాధ్యత అన్నారు కదా లోకేష్?

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, సంఘాలకు ఎన్నికలు నిర్వహించే బాధ్యత తనదే అని ప్రగల్భాలు పలికారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చాక సమస్యలకు పరిష్కారం చూపకపోగా, ప్రశ్నిస్తున్న వారిపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, రవి, వినోద్ అశోక్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉదయ్‌కుమార్, ప్రవీణ్, విష్ణు, వినయ్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున, నల్సా రాష్ట్ర అధ్యక్షుడు సుందర్, పీడీఎస్ఓ నాయకురాలు స్రవంతి, ఏఐఎస్ఐ, ఇతర విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్

తిరుపతి క్రైం : పోక్సో కేసులో వెస్ట్ పోలీసులు ఓ నిందితుడిని అరెస్ట్ చేసిన సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. వెస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్న 17 ఏళ్ల బాలిక..ఇటీవల అదృశ్యమైంది. తాజాగా బాలికను గుర్తించారు. అయితే బాలికను కోలా వీధికి చెందిన మెకానిక్ ఉమేష్(22) అత్యాచారం చేసినట్లుగా గుర్తించామన్నారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం రుయా హాస్పిటల్‌కు తరలించామన్నారు.

పాలక మండలి ఏర్పాటుకు దరఖాస్తులు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లిలో వెలసిన శ్రీ సర్వమంగళ సమేత శ్రీ పళ్లికొండేశ్వర స్వామి దేవస్థానంలో పాలక మండలి ఏర్పాటుకు దేవదాయ శాఖ ఉత్తర్వుల మేరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈఓ లత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ మేరకు దరఖాస్తులను శ్రీపళ్లికొండేశ్వర స్వామి దేవస్థానంలో సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. ఆశావహులు దరఖాస్తులను 27వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు అందజేయాలని కోరారు.